



# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 244

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 6 ఫిబ్రవరి 2024


## నవరత్నాల ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి

● ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ● విద్యా రంగంపై రూ. 73,417 కోట్లు ఖర్చు చేశామన్న గవర్నర్ ● ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం



**వెలగపూడి,కలంకౌంటర్ :** ఏపీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సమావేశాలకు వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్ కు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వాగతం పలికారు. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగం తర్వాత బీఏసీ సమావేశం జరిగింది. ఈ నెల 7న ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రవేశపెట్టనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఈ బడ్జెట్ కు అసెంబ్లీ ఆమోదం పొందనున్నారు. తమ ప్రభుత్వం ఇప్పటి వరకు నాలుగు బడ్జెట్ లను ప్రవేశ పెట్టిందని తన ప్రసంగంలో గవర్నర్ తెలిపారు. విజయవాడలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని చెప్పారు. తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. నవరత్నాల ద్వారా పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా సంస్కరణలను చేశామని తెలిపారు. పేదల పిల్లలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తున్నామని చెప్పారు. విద్యా రంగంపై రూ. 73,417 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. మనబడి నాడు - నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చామని చెప్పారు. సమాజిక న్యాయం, సమానత్వం కోసం తమ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. 8, 9 తరగతుల విద్యార్థులకు 9,52,925 ట్యాబ్ లను పంపిణీ చేశామని గవర్నర్ తెలిపారు. 1 నుంచి 10వ తరగతి వరకు జగనన్న గోరుముద్ద అమలు చేస్తున్నామని చెప్పారు. జగనన్న గోరుముద్దకు ఇప్పటి వరకు 4,417 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు.

## బటన్ నొక్కుడు కాదు నీ బొక్కుడు సంగతేంటి?

● సైకో జగన్?తో ప్రతి కుటుంబానికి 8లక్షల నష్టం ● టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు







**అనకాపల్లి జిల్లా మాడుగుల,కలంకౌంటర్ :** బటన్ నొక్కుడు కాదు, నీ బొక్కుడు సంగతేంటి ? జగన్? అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సూటిగా ప్రశ్నించారు. ప్రజలపై భారం వేసిన గజదొంగ జగన్‌మోహన్‌రెడ్డి అని మండిపడ్డారు. ఇప్పటి వరకు బటన్? నొక్కి జనంపై ఎంత భారం వేశారో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. బటన్ నొక్కుతున్నానని గొప్పలు చెప్పుకొంటున్న జగన్, కరెంట్ ఛార్జీలు పెంచి రూ. 64 వేల కోట్ల భారం మోపాడని, జగన్ బటన్ నొక్కితేనే ఆర్టీసీ ఛార్జీలు పెరిగాయని, జగన్ బటన్ పుణ్యం వల్లే చెత్తపన్ను వచ్చిందని చంద్రబాబు మండిపడ్డారు.

**రాష్ట్రం గెలవాలి..** ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్ కోసమేనని, ఈ ఎన్నికల్లో రాష్ట్రం గెలవాలి, ప్రజలు గెలవాలని చంద్రబాబు అన్నారు. ఇలాంటి సైకో సీఎంను తన జీవితంలో చూడలేదని, సైకో పాలన అంతం చేస్తే తప్ప మనకు భవిష్యత్ లేదని చెప్పారు. జగన్ బటన్ నొక్కుడుతో ప్రజలకు ఎంతో కష్టం వచ్చింది, ఒక్కో కుటుంబం రూ. 8 లక్షలు నష్టపోయిందని తెలిపారు. జగన్ జాబ్ క్యాలెండర్‌కు ఎందుకు బటన్ నొక్కలేదు? మద్య నిషేధానికి ఎందుకు బటన్ నొక్కలేదు ? సీపీఎస్ రద్దుకు ఎందుకు బటన్ నొక్కలేదు ? అని ప్రశ్నించిన చంద్రబాబు, జాబు రావాలంటే బాబు రావాల్సిందేనని అన్నారు. జగన్‌ది ఉత్తుత్తి బటన్ అని జనం గమనించాలని కోరారు.

**జగన్ ఇంటికి వెళ్లడం ఖాయం?..** వారంలో సీపీఎస్ రద్దు చేస్తానన్నాడు, ఎన్ని వారాలైంది ? రోడ్ల బాగు కోసం బటన్ ఎందుకు నొక్కలేదు ? రైతుల ఆత్మహత్యలు ఆపేందుకు బటన్ ఎందుకు నొక్కలేదు, డీఎస్సీ కోసం ఇన్నాళ్లూ ఎందుకు బటన్ నొక్కలేదు ? అని చంద్రబాబు దుయ్యబట్టారు. మైనింగ్ బటన్ నొక్కి భూగర్భ సంపద దోచేశాడు, ఇసుక బటన్ నొక్కి తాడేపల్లికి సంపద తరలించాడు, జగన్ బటన్ డ్రామాలు అందరికీ తెలిసిపోయాయి, రేపు ప్రజలంతా ఒకే బటన్ నొక్కుతారు, ప్రజలు నొక్కే బటన్‌తో జగన్ ఇంటికి వెళ్లడం ఖాయం అని అన్నారు. ధనదాహంతో జగన్ ఉత్తరాంధ్రను ఊడ్చేశాడు, రుషికొండను అనకొండలా మింగేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారు, సాక్షి పేపర్‌కు మాత్రం రూ.1000 కోట్లు కట్టబెట్టి, సలహాదారుల పేరిట వందల కోట్లు దోచిపెట్టారని, ఒక్క సజ్జలకే రూ.150 కోట్లు దోచి పెట్టారని చంద్రబాబు మండిపడ్డారు.

**విశాఖలో రూ.40వేల కోట్ల దోపిడీ..** విశాఖపట్నం పెట్టుబడులకు స్వర్గధామం అన్న చంద్రబాబు, విశాఖలో రూ.40వేల కోట్ల దోపిడీ జరిగిందని, తాను విశాఖకు తెచ్చిన కంపెనీలను జగన్ తరిమేశారని తెలిపారు. లూలూ కంపెనీని తరిమికొట్టి ఆ భూమి మింగేశారని వెల్లడించారు. విశాఖ ఉక్కుపై జగన్ ఒక్క మాట కూడా మాట్లాడరని, దోచుకోవడమే తప్ప జగన్‌కు ఉత్తరాంధ్రపై ప్రేమలేదని అన్నారు. గంజాయి అమ్ముతూ ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో దొరికిపోయారు, విశాఖను జగన్ గంజాయి కేంద్రంగా, నేర రాజధానిగా మార్చాడు.. అలాంటి వ్యక్తి మనకు అవసరమా? అని చంద్రబాబు ప్రశ్నించారు.

**ఫ్యాన్ రెక్కలు విరిచేయాలి..** ఎంపీ కుటుంబసభ్యులను కూడా కిడ్నాప్ చేసి డబ్బు అడిగారు, తహసీల్దార్ రమణయ్యను ఇంట్లోకి వచ్చి చంపేసి చక్కగా విమానంలో వెళ్లిపోయారు, అసలు ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. పులివెందుల రౌడీలు విశాఖను కబ్జా చేస్తున్నారని, జగన్ బంధువు అనిల్‌రెడ్డి విశాఖలో కబ్జాలకు పాల్పడడంతో జగన్‌రెడ్డి మా ప్రాంతానికి రావొద్దని విశాఖ జనం అంటున్నారని చంద్రబాబు తెలిపారు. ఐదేళ్లు రాజధాని లేకుండా చేసి జగన్ చరిత్రహీనుడిగా మిగిలిపోయారని, వైఎస్సార్సీపీ ఫ్యాన్ మూడు రెక్కలు విరిచేసి, మొండి ఫ్యాన్‌ను జగన్‌కు రిటర్న్ గిఫ్ట్‌గా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్రలో విజయసాయి, సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి పెత్తనమేంటి? అని చంద్రబాబు ప్రశ్నించారు. తాను కూడా జగన్‌మోహన్‌రెడ్డి బాధితుడినేనన్న చంద్రబాబు, అయ్యన్నపాత్రుడిపై రేప్ కేసు, ఎస్సీ నేత అనితపై అట్రాసిటీ కేసు, ఎందరో టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు.

**ఇంట్లో ఎంతమంది ఉన్నా రూ.1500..** తెలుగుదేశం అధికారంలోకి వస్తే జరిగే ప్రయోజనాలను చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామన్న చంద్రబాబు, 19 నుంచి 59 ఏళ్ల వయస్సు మహిళలకు నెలకు రూ.1500 అందిస్తామని చెప్పారు. ఇంట్లో ఎంతమంది ఆడబిడ్డలు ఉంటే అందరికీ రూ.1500 చొప్పున ఇస్తాం, ఆడబిడ్డలను చదివిస్తే ఇంట్లోని అందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తాం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని స్పష్టం చేశారు.

## సిఎం ను కలిసిన డాక్టర్ చంద్రశేఖర్



**తాడేపల్లి,కలంకౌంటర్ :** సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన అవనిగడ్డ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ రావు, ఆయన తనయుడు సింహాద్రి రామ్‌చరణ్.

## ఆర్యవైశ్యుల సేవా గుణం చాలా గొప్పది : హోం మంత్రి తానేటి వనిత







**ఏలూరు,కలంకౌంటర్ :** సమాజంలో ఆర్య, వైశ్యులు సేవా కార్యక్ర మాల్లో ముందుంటారని వారి సేవా గుణాన్ని రాష్ట్ర హోం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత కొనియాడా రు. అన్ని దానాలలో వారు ముందుంటారని అభినందించారు. ఏలూ రులో సి.ఆర్. రెడ్డి కాలేజి ఆడిటోరియం లో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు అర్బన్ జిల్లాల ఆర్య వైశ్య సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి హోం మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లక్కీడిప్ డ్రా తీసి.. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ తాను ఆర్య, వైశ్యుల ఇంటి బిడ్డని తెలిపారు. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గంలోని ప్రతి ఆర్యవై శ్య కుటుంబ సభ్యులతో సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. గోపాలపురం నియోజకవర్గం కి చెందిన వెలగా శ్రీరామమూర్తి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘానికి అధ్యక్షునిగా ఎన్నిక కావడం సంతోషకరమన్నారు. ఆయన కు హోంమంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్యులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆర్యవైశ్యల ఇష్టదైవం కన్యకాపరమేశ్వరి ఆశీస్సులు అందరి పై ఉండాలని, వారి వ్యాపార అభివృద్ధి చెంది సమాజానికి మరిన్ని సహాయం చేయాలని హోంమంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆర్య వైశ్య సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకునే హక్కు పోలీసులకు ఎక్కడిది? : బాలకృష్ణ






**అమరావతి,కలంకౌంటర్ :** అసెంబ్లీకి వెళ్లే సభ్యులను అడ్డుకునే హక్కు పోలీసులకు ఎక్కడిదని టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మండిపడ్డారు. సచివాలయం అగ్నిమాపక కేంద్రం వద్ద 'బైబై జగన్' అంటూ ప్లకార్డులు పట్టుకొని తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. బారికేడ్లు అడ్డుపెట్టి పోలీసులు వారిని అడ్డుకోవడంతో నేతలు వాగ్వాదానికి దిగారు. జాబ్ క్యాలెండర్ విడుదల ఎప్పుడు? పోలవరం పూర్తి ఎక్కడా? అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ పనైపోయిన వైకాపా ప్రభుత్వం గురించి ప్రత్యేకంగా చెప్పేందుకు ఏముంటుందని వ్యాఖ్యానించారు. తమను చూసి సీఎం జగన్ భయపడుతున్నారన్నారు. అసెంబ్లీకి వచ్చే నేతలను అడ్డుకునే కొత్త సంప్రదాయానికి వైకాపా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని దుయ్యబట్టారు. అనంతరం బారికేడ్లను తోసుకుంటూ కాలినడకన అసెంబ్లీకి వెళ్లారు.

**జగన్‌కు ఇవే చివరి సమావేశాలు..** అంతకుముందు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వైకాపాలా ఒక స్థానానికి ఉదయం ఒకరిని, రాత్రికి మరొకరిని మార్చే పార్టీలు తెలుగుదేశం, జనసేన కావన్నారు. చివరి అసెంబ్లీ సమావేశాల్లోనైనా జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ ఒక అబద్ధాల కోరని నేతలు మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. జగన్ ఇంటికి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. అందుకే సిద్ధం పేరుతో సభలు నిర్వహిస్తున్నారని ఎద్దేవా చేశారు. పులివెందులలో గెలుపుపై జగన్ నమ్మకం కోల్పోయారని.. వ్యక్తిగతంగా కూడా ఆయనకు ఇవే చివరి సమావేశాలన్నారు. డీఎస్సీ విషయంలో 5 ఏళ్లుగా సీఎం తమని మోసం చేశారంటూ బాలకృష్ణకు నిరుద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే తప్పక న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## పొన్నలూరు నూతన ఎస్సైగా వెంకట రాజేష్ బాధ్యతల స్వీకరణ



**పొన్నలూరు, కలంకౌంటర్ :** పొన్నలూరు నూతన ఎస్సైగా ఎం వెంకట రాజేష్ సోమవారం బాధ్యత స్వీకరించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ పొన్నలూరు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు, ఫ్రెండ్లీ పోలీసింగ్ కు ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. అక్రమ మద్యం, అక్రమ ఇసుక రవాణా, జూదం, పేకాట గంజాయి అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజేష్ తెలిపారు. నూతనంగా చార్జి తీసుకున్న తర్వాత పొన్నలూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సై రాజేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు మండలం ఎంపీపీ కొండా బత్తిన మాధవ , గోపాల రెడ్డి , జె సి ఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతి రెడ్డి , వైఎస్ఆర్సిపి నాయకులు శ్రీనివాస రెడ్డి , భాస్కర్ వివిధ గ్రామాల నాయకులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువకులు ఎస్ఐ ని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## బాధ్యతలు తీసుకున్న నూతన తాసిల్దార్ రాంబాబు



**పెడన (కృష్ణా జిల్లా),కలంకౌంటర్ :** పెడన నూతన తహసిల్దారుగా ఆర్.రాంబాబు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఇక్కడ తహసిల్దారుగా పనిచేసిన మధుసూదన్ రావు పాలకొల్లుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాంబాబు భీమవరం కలెక్టరేట్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు తీసుకున్న నూతన తాసిల్దారును డిప్యూటీ తాసిల్దార్ పూర్ణచంద్రరావు, రీ సర్వే డిటి పేపేటి సత్యనారాయణ, ఆర్ ఐ మాధు మణికుమార్ , వీఆర్వోలు పరసా గోవిందరాజులు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఆశ్రమ పాఠశాలకు ప్రింటర్ బహుకరణ



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి లోని బిసి మత్స్యకారుల ఆశ్రమ పాఠశాలకు రావి దుర్గా సుధాకర రెడ్డి – సౌదామిని దంపతులు 20వేల విలువతో కొనుగోలు చేసిన ప్రింటర్ను బహుకరణగా అందజేశారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా రావి దుర్గా సుధాకర్ రెడ్డి పాఠశాల హెచ్ఎం సాగర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కంఠమనేని కుటుంబరావు, కోడూరు మండలం స్వతంత్ర పురం జడ్పీపాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏవి రమణ, ఉపాధ్యాయులు కె.వి రత్తయ్య ...తదితరులు ఉన్నారు.

## తహసిల్దార్ గా ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న మేడపాటి శ్రీవిద్య



**మోపిదేవి,కలంకౌంటర్ :** మచిలీపట్నం తహసిల్దార్ గా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా శ్రీవిద్య మోపిదేవి తహసిల్దార్ గా బదిలీపై వచ్చారు. రెవెన్యూ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇల్లు లో భాగంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మోపిదేవి శ్రీనివాసరావు ,వీఆర్వోలు,తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అపరాజిత వామ్ అవార్డుకు ఎంపికైన చుండూరు గాయిత్రి



**వేటపాలెం,కలంకౌంటర్ :** ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు చుండూరు గాయత్రీ అపరాజిత వామ్ అవార్డ్స్ 2024కు ఎంపికైంది. ఈ పురస్కారాన్ని ఫిబ్రవరి 10వ తేదీన చెన్నైలో జరిగే వామ్ నేషనల్ ఉమెన్స్ కాన్ఫరెన్స్ నందు ఈ పురస్కారాన్ని గాయత్రీ కి అందజేస్తామని వామ్ గ్లోబల్ వర్కింగ్ మహిళా విభాగ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గాయత్రి మాట్లాడుతూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి అపరాజిత వామ్ పురస్కారాన్ని తనకి ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.తనకు ఈ పురస్కారం లభించినందుకు గ్లోబల్ ప్రెసిడెంట్ తంగుటూరి రామకృష్ణ కు, మహిళా ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్ కు గాయత్రి ధన్యవాదాలు తెలిపారు.

# ఎంపీగా దగ్గుమల్ల ప్రసాదరావు కె అవకాశం

● ప్రాథమిక సభ్యత్వం కూడా తీసుకున్న ఎంపీ అభ్యర్థి ● గతంలో ఉన్న విమర్శలకు చెక్ పెట్టిన ప్రసాదరావు ● స్థానికత అనే అంశం ఆయనకు అందివచ్చే అంశం



**పిట్టలవాని పాలెం(బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** బాపట్ల ఎంపీ అభ్యర్థి పై ఉత్కంఠ కు తెరపడనుంది. గతంలో పెద్ద పెద్ద సభలతో అనూహ్యంగా ఎంపీ అభ్యర్థి అంటూ తెరపైకి వచ్చారు. ప్రతి ఒక్కరి కి గుర్తుండే విధంగా కార్యాచరణ సిద్ధం చేసి ముందుకు సాగారు. ఈ క్రమంలో ఎన్నో విమర్శలు ఆయనను చుట్టుముట్టాయి. అసలు ఎంపీ అభ్యర్థి అయితే ప్రాథమిక సభ్యత్వం ఉండాలి కదా?అంటూ వ్యతిరేకులు పుకార్లు పుట్టించారు. ఈ పుకార్లు కి చెక్ పెట్టె విధంగా ప్రసాదరావు టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. సుదీర్ఘంగా హై కమాండ్ ఆలోచనలు ఆయన పై చూసే విధంగా ఆయన కార్యాచరణ ఉంది. గతం లోను ఆయన పని చేసిన పదవులకు వన్నె తెచ్చే విధంగా ఆయన ముందుకు సాగారు. ఈ క్రమంలో తన సామాజిక వర్గంలో అనగారిన వారికి చేయూత అందించే విధంగా ఈ రాజకీయాలు ఒక ప్లేట్ ఫారం గా ఉపయోగ పడుతుంది అనే ఆలోచన చేశారు ఆయన. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందు చూపు, రాష్ట్ర అభివృద్ధి కి ప్రణాళిక అనే వి ప్రసాద్ రావు ను ఆకర్షించే విధంగా చేసాయి. అనుకున్నది తడవుగా ప్రసాదరావు చంద్రన్న ఆదేశం తో ప్రజల్లోకి పరిచయ వేదిక పేరుతో బాపట్ల పార్లమెంట్ గడ్డ పై అడుగుమోపారు. ఈ క్రమంలో అతి తక్కువ సమయంలో ఈయన పేరు పరిచయం అక్కర్లేకుండానే ప్రజల మనిషిగా పేరు గడించారు. అదే విధంగా బాపట్ల జిల్లా వాసుడుకావటం ఇక్కడి ప్రజల బాధలు ఆయనకు తెలియటం తద్వారా తన స్థాయిలో పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లటం అనే అంశాలు ఆయనకు కలిసి వచ్చే అంశాలు. ఈ క్రమంలో అధినేతాలోచనే కాకుండా స్థానిక నాయకులు కూడా ఇలాంటి అనుభవం,ఆర్థిక వ్యవస్థ లో పట్టు వెరసి ప్రసాదరావు కు ఎంపీ అభ్యర్థి గా ప్రకటిస్తే గెలుపు నల్లేరు మీద నడక అవుతుంది అనే భావన వ్యక్త పరుస్తున్నారు. ఇప్పుడు ఆయన సభ్యత్వం కూడా తీసుకోవటం ప్రజల మాటకు బలాన్ని చేకూరుస్తున్నాయి. స్థానికత అనేది ఇక్కడ ప్రజల్లో పాతుకు పోయింది. వేరే నాయకులు ఇక్కడి కి వస్తే చుట్టం చూపుగా వస్తారు ప్రజాలపై సీతకన్ను వేస్తారు అనే భావన బాగా ఉంది. గతం నుండి ఇక్కడ నాయకులకు, బయటి నాయకులకు తేడా చూసిన ప్రజలకు స్థానికుల పై మాత్రమే మక్కువ ఉంది. ఏది ఏమైనా స్తానుకుడైన ప్రసాదరావు కు ఎంపీ టికెటిస్తే ఇటు అసంబ్లీ ఎన్నికల కు కూడా ఆయన చరిష్మా తోడ్పాటు అయ్యి టీడీపీ విజయ పదానికి అవకాశం ఉంది. ఈఅంశాలు టీడీపీ అధినాయకుడు ఆలోచన చేస్తున్నట్లు కూడా విశ్వసనీయసమాచారం. ఏది ఏమైనా ప్రసాద్ రావు కు ఎంపీ అభ్యర్థి గా అవకాశం రావాలి అని బాపట్ల ప్రజలు కోరుకుంటున్నారు.

## మైక్రో కంట్రోలర్ రూపకల్పన పై ప్రకాశంలో వర్క్ షాప్



**కందుకూరు,కలంకౌంటర్ :** ఆర్డినో ప్రోగ్రామింగ్ లాంగ్వేజి పారిశ్రామిక- హెూమ్ అప్లయన్స్ లలో వినియోగించే మైక్రో కంట్రోలర్ బోర్డులకు రూపకల్పనకు ఉపయోగపడుతుందని ఏపీ స్కిల్ డెవలప్మెంట్ శిక్షకులు బి.మహిందర్ వెల్లడించారు. ఏ.పీ.ఎస్.డి.సి ద్వారా ఎన్నో ఆధునిక కోర్సుల శిక్షణకు అవకాశాలు ఉన్నాయన్నారు. గ్లోబల్ స్థాయి లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా ఉండే కోర్సులు వాటిలో ఉన్నాయన్నారు.సోమవారం ప్రారంభమైన వర్క్ షాపు వారం రోజులు ప్రయోగాత్మకంగా బోధన ఉంటుందని అభయమిచ్చారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ సమర్థత,చిత్తశుద్ధి, నైపుణ్యం ఉన్నవారికి ఉద్యోగాల కొరత సమస్య లేదని స్పష్టం చేశారు. అకడమిక్స్ లో ఉన్నత మార్కులు ఉన్న వారు కూడా నైపుణ్యాల కొరతే లోపమై ఇంటర్వ్యూలు ఎదుర్కోవడంలో విఫలమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాల నిర్వహించే వర్క్ షాప్ ల ద్వార నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, ప్రాథమిక అంశాల పట్ల పట్టు సాధిస్తే పారిశ్రామిక రంగంలో ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు అని చెప్పారు. నైపుణ్యాలు ఉన్న ప్రతి విద్యార్థి ఉద్యోగం పొందేలా ప్రతి సంవత్సరం తమ కళాశాల క్యాంపస్ రిక్రూట్మెంట్ ను నిర్వహిస్తుందన్నారు. ఈ వర్క్ షాప్ ను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ థర్డ్ ఇయర్ విద్యార్థులకు నిర్వహించనున్నారు. వర్క్ షాప్ నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం బి.మహీధర ను స్కిల్ రిసోర్స్ పర్సన్ గా నియమించింది. వర్క్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. రవికుమార్, ఈసీఈ విభాగ అధ్యాపకులు డాక్టర్ కె. హనుమంతరావు, ఐ. రామకోటేశ్వరరావు, యన్.శ్రీహరి, యస్.మాధవ, జి. సురేష్, యస్. కె మస్తాన్ వలి మరియు కిషోర్ కృష్ణ లు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధం ఎక్కడ జగన్ రెడ్డి ? - తెదేపా అధికార ప్రతినిధి గోచిపాతల మోషే

● మద్యపాన నిషేధం అమలు చేయకుండా మహిళలను ఓట్లు అడిగేదమ్ము వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఉందా ?.....



**కందుకూరు,కలంకౌంటర్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన తర్వాత కల్తీమద్యం , నకిలీమద్యం తాగి కొన్నివందల మంది పేదప్రజలు చనిపోయి వారికుటుంబాలు బజారునపడిన వారిని ఆదుకోవడంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేత హెూదాలో పాదయాత్ర చేస్తున్న సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత విడతల వారీగా మద్యపాన నిషేధం అమలు చేస్తామని మహిళలకు హామీ ఇచ్చి మహిళల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి విడతల వారీగా మద్యం రేట్లు పెంచుతూ గ్రామాలలో సైతం కల్తీ మద్యంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్న వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా బెల్టుషాపు నిర్వాహకులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అండగా ఉంటున్నారని మోషే ఆవేదన వ్యక్తంచేశారు. మద్యపాన నిషేధం అమలు చేయకుండా మహిళలను ఓట్లు అడిగే దమ్ము , ధైర్యం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఉందా అని మోషే ప్రశ్నించారు. ప్రభుత్వ మద్యంషాపులలో డిజిటల్ పేమెంట్ అవకాశం లేకుండా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ ప్రతిరోజు తాడేపల్లి ప్యాలెస్ కు వందల కోట్ల రూపాయలు వెళ్లేవిధంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళిక రచించిందని మోషే ఘాటు వ్యాఖ్యలు చేశారు. మద్యపాన నిషేధం అమలు చేయకపోగా మద్యం షాపులమీద కొన్ని వందలకోట్లు అప్పులు చేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల జేబులు నింపే కార్యక్రమానికి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మోషే మండిపడ్డారు.

## వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలి - దేవకి



**తెనాలి,కలంకౌంటర్ :** కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు అన్నారు.శ్రీశ్రీశ్రీ ప్రగ్యానంద సరస్వతి బాలస్వామి వారి నేతృత్వంలో త్రిబుల్ హార్స్ మినప గుళ్ళు యజమాని నంబూరి కృష్ణస్వామి ఆధ్వర్యంలో తాలూకా హై స్కూల్ నందు ఏర్పాటుచేసిన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి( సెట్టింగ్ ) ఆలయమునందు స్వామి వారి ఉదయాస్తమ సేవలో భాగంగా వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు అభిషేకం, ఏకాంత సేవ, కళ్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి సేవా కార్యక్రమంలో పాల్గొన్న దేవకిని శ్రీ శ్రీ ప్రజ్ఞ సరస్వతీ బాలస్వామి వారు స్వామివారి శేష వస్త్రం, తీర్థప్రసాదాలు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనవరి 29వ తేదీ నుండి ఫిబ్రవరి 4 ఆదివారం వరకు ఏడు రోజులు పాటు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉదయాస్తమ సేవలు ఎంతో వైభవంగానిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతిరోజు కోటి గోవింద నామాల చొప్పున ఏడు కోట్ల గోవింద నామాలు స్వామివారికి ఆలపిస్తున్నారని తెలిపారు. లక్ష లడ్డూలతో నైవేద్యం, సుమారు పదివేల మందికి స్వామివారి ప్రసాదాన్ని అందజేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానని దేవకి అన్నారు. బాచుపల్లి స్వామి, తాళ్లపాలెం శైవ అధిపతి శివ స్వామి పాల్గొని భక్తులకు ప్రవచనాలు బోధించారు. వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుందూరి ఉమామహేశ్వరరావు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శారదా పీఠం వార్షికోత్సవాలకు ఆహ్వానం



**అమరావతి, కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ ను కలిసి శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలకు రావాలని ఆహ్వానించిన శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ఈ నెల 15 నుంచి 19 వరకు విశాఖపట్నం శ్రీ శారదాపీఠం వార్షికోత్సవాలు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి రాజశ్యామల అమ్మవారి ప్రసాదాలు అందజేసిన స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ


## తెలుగుదేశం పార్టీ సూపర్ 6 పథకాలకు ప్రజామద్దతుఇంటూరి నాగేశ్వరరావు..



**కందుకూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ సూపర్ 6 పథకాలకు ప్రజల మద్దతు లభిస్తుందని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.మున్సిపాలిటీ 4 వ వార్డు, RTC డిపో ఉత్తరం ఏరియాలో బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదిఅయితే వైసిపి ప్రభుత్వంలో 72 పథకాలు రద్దు చేశారు. ఈ ప్రభుత్వంలో కార్పొరేషన్ ద్వారా ఒక్కరికైనా రుణం అందించారా ? ఇది ప్రజా వ్యతిరేక ప్రభుత్వం. జగన్మోహన్ రెడ్డిని గద్దె దించకపోతే భావితరాలకు భవిష్యత్తు ఉండదు – ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, వార్డు అధ్యక్షుడు మచ్చ మనోహర్, వార్డు నాయకులు నందనవనం రాము, శేఖర్, తదితరులు

# 11 నుంచి మాఘ మాసం ప్రారంభం

- ఏప్రిల్ 26 వరకూ వివాహాల కోలాహలం
- 3 నెలల్లో 30 ముహూర్తాలు
- ఆ తర్వాత మూఢం, శూన్య మాసం
- తిరిగి శ్రావణంలోనే ముహూర్తాలు
- అన్నవరంలో వివాహ బృందాల
- ముందస్తు రిజర్వేషన్లు



**అన్నవరం,కలంకౌంటర్ :** చాన్నాళ్ల తరువాత సత్యదేవుని సన్నిధి మళ్లీ నవ దంపతులతో కళకళలాడనుంది. ఈ నెల 11వ తేదీ నుంచి మాఘ మాసం ప్రారంభమవుతుండటంతో.. రాష్ట్రవ్యాప్తంగా పలు జంటలు స్వామి సన్నిధిలో.. వేద మంత్రాలు సాక్షిగా.. జీవితాన్ని పండించుకునేందుకు కొంగులు ముడి వేసుకోనున్నాయి. రత్నగిరిపై వివాహాలు చేసుకునేందుకు ఇప్పటికే పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 13వ తేదీ ముహూర్తంతో ఇక్కడ వివాహాల కోలాహలం ఆరంభం కానుంది. దీంతో ఇటు సత్రం గదులు, కల్యాణ మండపాలతో పాటు పురోహితులు, కేటరింగ్, సన్నాయి మేళం వారికి గిరాకీ పెరిగింది. సుమారు రెండు నెలల విరామం అనంతరం వివాహాలు మొదలవుతూండటంతో సత్రం గదులు, వివాహ మండపాలను అద్దెకిచ్చే సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (సీఆర్ఓ) వద్ద, ఉచిత కల్యాణ మండపాల వద్ద పెళ్లిబృందాల సందడి మొదలైంది. పలువురు కల్యాణ మండపాలు, సత్రం గదులను ముందస్తుగా రిజర్వేషన్ చేసుకుంటున్నారు.

## సర్పంచ్ హౌస్ అరెస్ట్



**తిరువూరు (ఎన్ టి ఆర్ జిల్లా),కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు సర్పంచ్ లకు జరుగుతున్న అన్యాయాలను అడ్డుకోవడానికి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన తెల్లదేవర పల్లి గ్రామ సర్పంచ్ రాయల నాగ రాణి ని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ లకు నిధులు ఇవ్వకుండా ఉంటే నమ్మి గెలిపించిన ప్రజలకు ఏ విధంగా సేవ అందించగలమని ప్రశ్నించారు.



**విస్సన్నపేట మండలం, తహసిల్దార్ గా యం.సుజాత నేడు బాధ్యతలు చేపట్టారు..**

–విస్సన్నపేట,కలంకౌంటర్ :

# మోపిదేవి లో జనసైనికులు సంబరాలు...




**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మోపిదేవి ప్రధాన సెంటర్ నందు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాల సౌరి జనసేన పార్టీలో జాయిన్ అయినా సందర్భంగా మండల కేంద్రమైన మోపిదేవిలో జనసైనికులు సంబరాలు నిర్వహించారు. జనసేన నాయకులు భోగిరెడ్డి సాంబయ్య ఆధ్వర్యంలో మోపిదేవి సెంటర్లో గుడి వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం సెంటర్లో మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా జన సైనికులు మరియు భోగిరెడ్డి సాంబయ్య మాట్లాడుతూ బాలశౌరి జనసేనకు రావడంతో ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులుగా వల్లభనేని బాలసౌరి గారి నీ అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని వాళ్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరజా కిరణ కాంత్, ఎర్రం శెట్టి సునీల్, కలపాల ప్రసాద్, కాగితాల సాంబశివరావు, కేశవ, కామిశెట్టి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు దిడ్ల జానకి రాంబాబు, చందన రంగారావు, మోపిదేవి శ్రీనివాసరావు, మోపిదేవి బాబురావు, గవిని శివరామకృష్ణ, కోసూరు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# మన గ్రామానికి మన సత్య కార్యక్రమం జయప్రదం చేయాలి : అనుమోలు సాంబశివరావు



**పొన్నలూరు, కలంకౌంటర్ :** టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య చేపట్టిన మన గ్రామానికి మన సత్య కార్యక్రమం ఈ నెల 7,8,9, తేదీలలో పొన్నలూరు మండలంలో వుంటుం దని, ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షులు అను మోలు సాంబశివరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరి ఇంటి తలుపు తట్టలన్న నేపథ్యంలో మన గ్రామానికి మన సత్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఉన్న సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు వాటికి పరిష్కారంకోసం ఎలా చేయాలో అవగాహన కోసం యాత్ర చేపట్టారన్నారు. ఈ యాత్ర ద్వారా అన్ని వర్గాల ప్రజలతో మమేకం అవుతూ వైసీపీ అరాచక పాలనను తరిమి కొట్టేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే స్వామి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కష్టపడాలని చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రి గా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్, సీనియర్ నాయకులు కర్ణా కోటిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రాపూరి కోటేశ్వరమ్మ, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మండవ మురళి, బీసీ సెల్ అధ్యక్షులు కుర్రా మాల్యాద్రి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మొరబోయిన మాల్యాద్రి, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి గెట్టబోయిన మల్లికార్జున తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# జయహొ బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు : కుర్రా మాల్యాద్రి, గెట్టబోయిన మల్లిఖార్జున, మొరబోయిన మాల్యాద్రి



**పొన్నలూరు, కలంకౌంటర్ :** బీసీ వర్గాలకు అన్ని విధాలా అండగా నిలిచింది తెలుగుదేశం పార్టీ అని మండల బీసీ సెల్ అధ్యక్షులు కుర్రా మాల్యాద్రి అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కుర్రా మాల్యాద్రి, గట్టిబోయిన మల్లికార్జున, మోరుబోయిన మాల్యాద్రి కలిసి మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన పొన్నలూరు గ్రామంలో జరిగే జయహొ బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ హయాంలో బీసీ లకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసారని తెలిపారు. 2024లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక బీసీ లకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకోస్తారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ ఇచ్చిన హామీ ని గుర్తు చేశారు. జయహొ బీసీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా కొండపి శాసనసభ్యులు డా. డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య హాజరవుతునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్, సీనియర్ నాయకులు కర్ణా కోటిరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మండవ మురళి, ఒంగోలు పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రాపూరి కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు

● తీర్మానాలను మీడియాకు వెల్లడించిన టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి





**తిరుమల,కలంకౌంటర్ :** తిరుమల ఆస్థానమండపంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు సోమవారం ముగిసింది. ఈ సదస్సులో పీఠాధిపతులు, మఠాధిపతుల సూచనలతో చేసిన తీర్మానాలను చివరి రోజు టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి మీడియాకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ 1933వ సంవత్సరంలో శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్య వైభవాన్ని, సనాతనధర్మాన్ని ప్రపంచమంతటా ప్రచారం చేయటానికి తిరుమల తిరుపతి దేవస్థానముల ఆవిర్భావం జరిగిందన్నారు. దాససాహిత్య ప్రాజెక్టు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వ్మాయ ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు, నాలాయిర దివ్యప్రబంధ పారాయణ ప్రాజెక్టు, శ్రీనివాస కల్యాణోత్సవ, శ్రీ వేంకటేశ్వర వైభవోత్సవ ప్రాజెక్టు తదితర ప్రాజెక్టుల ద్వారా ధార్మిక కార్యక్రమాలను దేశవ్యాప్తంగా తీసుకెళుతున్నామని చెప్పారు. దశాబ్దాల క్రితమే శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాల ద్వారా గోసంరక్షణకు టీటీడీ శ్రీకారం చుట్టిందన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాపింపచేయడానికి శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్‌ను తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఏర్పాటుచేసి ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి వైభవాన్ని చాటుతున్నట్టు వివరించారు. పురాణేతిహాస ప్రాజెక్టు ద్వారా అనేక పురాణాలు, ఆధ్యాత్మిక గ్రంథాల ముద్రణ, శ్రీ వేంకటేశ్వర రికార్డింగ్ ప్రాజెక్టు భక్తి సంకీర్తనలకు ప్రాచుర్యం కల్పిస్తున్నట్టు ఛైర్మన్ తెలిపారు. గతంలో తాను ఛైర్మన్‌గా ఉన్నపుడు 2007, 2008లో రెండు సార్లు ధార్మిక సదస్సులు నిర్వహించామన్నారు. ఆ సదస్సుల్లో స్వామీజీలు చేసిన సూచనల ఆధారంగానే దళితగోవిందం, మత్స్య గోవిందం, అర్చకులకు శిక్షణ, కల్యాణమస్తు వంటి అనేకానేక ధార్మిక కార్యకలాపాలకు శ్రీకారం చుట్టామని తెలియజేశారు. శ్రీవారి అనుగ్రహంతో దాదాపు 17 ఏళ్ల తరువాత మళ్లీ ధర్మప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లే అవకాశం తనకు దక్కిందన్నారు. హిందూ ధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు మూడు రోజులుగా జరుగుతున్న ధార్మిక సదస్సులో ఎందరో మహానుభావులైన పీఠాధిపతులు, మఠాధిపతులు తమ అమూల్యమైన సూచనలను అందించారని చెప్పారు.

## శ్రీ వేంకటేశ్వర ధార్మిక సదస్సు తీర్మానాలు..

**1. హిందూమతంలో చేరాలనుకునేవారికి పవిత్రజల సంప్రోక్షణ ప్రక్రియ :** ఈ సదస్సుకు వచ్చిన పలువురు స్వామీజీల ఏకకంఠ అభిప్రాయాన్ని అనుసరించి ఇతర మతస్తులు ఎవరైనా స్వచ్ఛందంగా హిందూ మతంలోకి మారడానికి శ్రద్ధతో ఇష్టపడి వచ్చేవారి కోసం తిరుమలలో ఒక ప్రాంగణం ఏర్పాటుచేసి పవిత్రజల ప్రోక్షణంతో విధిపూర్వకంగా ప్రక్రియను నిర్వహించి స్వాగతించాలని, ఒకసారి శ్రీవారి దర్శనం కల్పించాలని సదస్సు తీర్మానించింది.

**2. పురాణ ప్రచారం :** సమాజంలో పిల్లల నుంచి పెద్దల వరకు హైందవధర్మాన్ని సరళంగా అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పేవి పురాణాలు. కనుక పురాణముల విస్తృత ప్రచారం చేయుటకు అదేవిధంగా సామర్థ్యం కలిగిన పురాణ ప్రవచనకర్తలకు శిక్షణనిచ్చుట అవసరం అని సదస్సు తీర్మానించింది.

**3. తిరుపతిలో పవిత్ర వాతావరణం :** తిరుమల చేరుకోవాలంటే యాత్రికులందరూ తప్పనిసరిగా తిరుపతికి రావలసిందే. కనుక యాత్రికులకు తిరుమలలో లాగే తిరుపతిలో కూడా సంపూర్ణమైన ఆధ్యాత్మిక వాతావరణం, భక్తిభావన కలగాలి. అందుకు తగినట్లుగా తిరుపతిని మార్చాలని సదస్సు తీర్మానించింది.

**4. సమైక్యతా భావం పెంపొందించడం, మతాంతీకరణ నివారణోపాయాలు :** నానాటికీ హిందూ సమాజం బలహీనం కావడానికి కారణం కొన్ని వర్ణ, వర్గాల పట్ల కొందరికి ఉన్న వివక్షతో కూడిన దృష్టి ప్రధానాంశం. అందువలన ఆయా జాతులవారు హిందూసమాజానికి దూరం అవుతున్నారు. వారినందరినీ కలుపుకుని సనాతన ధర్మం అందరిదీ అని చెప్పడానికి అన్ని విధాలుగానూ ప్రయత్నించాలి. వారి మతాంతీకరణను నివారించుటకు తగిన ఉపాయాలను సిద్ధపరచుకోవాలని సదస్సు తీర్మానించింది.

**5. దేవాలయాల పరిరక్షణ, నిర్మాణం :** భారతీయ సమాజంలో అందరికీ చక్కని సంస్కారాలను నేర్పేవి దేవాలయాలు. అటువంటి దేవాలయాలు వేలాదిగా శిథిలమవుతున్నాయి, కొన్ని ప్రాంతాలలో పూర్తిగా కనుమరుగవుతున్నాయి. కనుక అందరికీ సంస్కారాలందించడానికి శిథిలములైన దేవాలయాలను ఉద్ధరించుట, దేవాలయాలు లేని చోట మరియు హరిజన, గిరిజన, మత్స్యకార ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించుట ఎంతగానో అవసరమని సదస్సు తీర్మానించింది. టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా హరిజన, గిరిజన, మత్స్యకార ప్రాంతాలలో 3600 ఆలయాల నిర్మాణం చేపట్టింది.

**6. గో సంరక్షణ :** హిందూ సమాజం గోవిందుని పట్ల ఎంత భక్తి కలిగి ఉన్నదో గోవు పట్ల కూడా అంతే భక్తి కలిగి ఉన్నది. హిందువులకు గోవు తల్లితో సమానం. కానీ నేటి సమాజంలో ఆధునిక అలవాట్ల ప్రభావం వల్ల గోమాతలు క్షీణించిపోతున్నాయి. కనుక గో సంరక్షణ అత్యావశ్యకతగా సదస్సు తీర్మానించింది.

**7. వేద, శాస్త్ర, విద్యావ్యాప్తి సంరక్షణ :** హిందూ ధర్మానికి మూలం వేదములు, శాస్త్రములు. ఏ యజ్ఞములు చేయాలన్నా, ఏ సత్కర్మలు ఆచరించాలన్నా వేదశాస్త్రాలు ఎంతో అవసరం. కనుక వేదశాస్త్రాల పరిరక్షణ ఎంతో అవసరమని సదస్సు తీర్మానించింది.

**8. సార్వజనీనంగా ధర్మ, ఆచార, సంప్రదాయ ప్రచారం, పరిరక్షణ :** హిందూ ధర్మముల పట్ల, ఆచారముల పట్ల, సంప్రదాయముల పట్ల అందరికీ ఆసక్తి, ఆదరణ, శ్రద్ధ తగ్గడానికి కారణం తగు ధర్మప్రచారం లేకపోవడమే. అందుకోసమై అన్ని విధములగా అందరికీ అర్థమయ్యే రీతిలో ధర్మాన్ని ప్రచారం చేయడం ఎంతో అవసరం అని సదస్సు తీర్మానించింది.

**9. మాతృమూర్తుల దర్మనిష్ట :** ఏ సమాజంలో తల్లి తన పిల్లలను శ్రద్ధగా పెంచుతుందో ఆ సమాజం ధర్మనిలయం అవుతుంది. కనుక హిందూ సమాజంలో ప్రతి మాతృమూర్తి తన పిల్లలకు బాల్యం నుంచి ధర్మబోధను చేయడానికి తగు విధంగా మాతృమూర్తులకు ధర్మనిష్ఠను కలుగచేసే శిక్షణా కార్యకలాపాలు అవసరమని సదస్సు తీర్మానించింది.

**10. యువతలో ధర్మప్రీతి, ధర్మాసక్తి :** నేటి సమాజంలో హిందూ యువతీ యువకులలో చాలామంది తమ చుట్టూ ఉన్న వాతావరణ ప్రభావం వల్ల, ధనకనకాది ప్రలోభాలవల్ల స్వధర్మాన్ని విడిచిపెట్టి మతాంతరీకరణకు లోనవుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికై ఎన్నో శిక్షణా శిబిరాలు నిర్వహించడం, ఇతర పథకాలు అవసరమని సదస్సు తీర్మానించింది.

**11. జీవవైవిధ్యపరిరక్షణ :** సహజంగా ఎన్నో అరుదైన వృక్ష జంతుజాతులకు ఆశ్రయమైనది తిరుమల సప్తగిరులు. కనుక ప్రయత్నపూర్వకంగా ఈ తిరుమల వనాలను, తిరుమలలోని వేలాది తీర్థాలను జాగ్రత్తగా పరిరక్షించి తిరుమల, తిరుపతి వీటి పరిసరప్రాంతాలను ఒక ప్రత్యేక జీవవైవిధ్యక్షేత్రముగా పరిరక్షించాలి అని సదస్సు తీర్మానించింది.

**12. వివిధ సేవలు, సత్సంగం..** భజనమండళ్ళు ఇతరబృందవ్యవస్థలను బలోపేతం చేయడం, 2007, 2008 సంవత్సరాలలో నిర్వహింపబడిన ధార్మిక సదస్సుల తీర్మానాలను అనుసరించి హరిజన, గిరిజన, మత్స్యకారులు మతాంతరీకరణము నుంచి నివారించుటకై అమలు చేయుచున్న, ప్రస్తుతము తక్కువస్థాయిలో జరుపబడుతున్న మరియు మధ్యలో నిలిపివేయబడిన ప్రణాలికలన్నిటినీ తిరిగి బలోపేతం చేసుకొనవలెనని సదస్సు తీర్మానించింది.

**13. జనశక్తి నిర్మాణం :** ఎన్ని పథకాలున్నా, ఎన్ని ఆలోచనలున్నా సామర్థ్యం కలిగిన కార్యశీలులు లేకపోతే అవి సఫలములు కావు కనుక ప్రతి వ్యక్తిలోని ధర్మపరిరక్షణా సామర్థ్యమును, ఆ ప్రచారానికి తగిన సామర్థ్యమును వీలైనంత ఎక్కువమందికి శిక్షణ ద్వారా నేర్పడం అవసరమని సదస్సు తీర్మానించింది.

**14. ఆధ్యాత్మిక కార్యక్రమాలు :** శారీరకబలం ఎంత అవసరమో మనిషి ఆత్మవిశ్వాసానికి, ఒడిదుడుకులను తట్టుకోడానికి ఆత్మికబలము కూడా అంతే అవసరం. కనుక హిందూ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుటకు తగిన శిక్షణా కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలని సదస్సు తీర్మానించింది.

**15. ద్రావిడవేద వికాసానికి ప్రణాళికలు :** ఋగ్వేదము మొదలైన వేదముల వలే 12 మంది ఆళ్వార్లచే మానవాళి శ్రేయస్సుకోసం అందించబడిన ద్రవిడవేదమునకు కూడా తగిన ప్రోత్సాహము, గుర్తింపు అవసరమని సదస్సు తీర్మానించింది.

**16. పాఠశాల విద్యార్థులకు కార్యక్రమాలు, ఉపాయాలు :** వివిధ పాఠశాలల్లో ప్రస్తుతం అమలులో ఉన్న పాఠ్యప్రణాళికలలో హిందూ ధర్మ ప్రాధాన్యతకు పెద్దపీట వేయాలని, ఇందుకై మరిన్ని ధర్మప్రబోధకములైన ప్రణాళికలు అవసరమని సదస్సు తీర్మానించింది.

**17. భాషాసామర్థ్యం %--% తెలుగు, సంస్కృతం :** హిందూ ధర్మానికి సంబంధించిన అన్ని విధాలైన అంశాలు తెలుగులోనో, సంస్కృతంలోనో ఎక్కువగా ఉన్నవి. వీటిని అర్థం చేసుకోవలెనన్నా, ఆచరించవలెనన్నా ఈ రెండు భాషల పరిజ్ఞానము బాలబాలికలకు, యువతీ యువకులకు అవసరమని వారందరికీ ఆ రెండు భాషలు నేర్పవలెనని సదస్సు తీర్మానించింది.

**18. సామాజిక ప్రచారమాధ్యమము :** నేటి సమాజంలో ఏవిషయమైనా ప్రతి ఒక్కరినీ చేరాలంటే సామాజిక ప్రచారమాధ్యమాలు ఎంతో ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. కనుక హిందూ ధర్మాన్ని ప్రచారం చేయుటకు కూడా అన్ని విధాలా ప్రచార, ప్రసార మాధ్యమాలను వినియోగించుకోవాలని సదస్సు తీర్మానించింది.

**19. ధార్మిక సంస్థలన్నీ ఏకీకృతం కావాలి..** తి.తి.దేతో కలిసి ఇటువంటి ధార్మికసదస్సులను నిర్వహించుటలో సహకరించాలి. హిందూ ధర్మరక్షణకై ఈ సదస్సు ఎంతగానో దోహద , పడుచున్నదని ఇటువంటి సదస్సులు ప్రతి సంవత్సరానికి ఒకసారి తిరుమలలో లేదా తిరుపతిలోనైనా జరగాలి. అలాగే గ్రామస్థాయిలోను, జిల్లా స్థాయిలోను కూడా నిర్దిష్టకాలపరిమితిలో తరచూ నిర్వహించాలని సదస్సు నిర్ణయించింది. ఈ సదస్సులో తీసుకున్న తీర్మానాలన్నిటినీ కేవలం తిరుమల తిరుపతి దేవస్థానములు ఆచరించుటయే కాక హిందూ ధర్మపరిరక్షణకు పాటు పడే అన్ని ధార్మికసంస్థలు కూడా అమలుపరచాలని సదస్సు తీర్మానించింది. అదేవిధంగా ఛైర్మన్ మాట్లాడుతూ తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామివారికి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామివారికి, సదస్సుకు విచ్చేసిన పీఠాధిపతులకు, మఠాధిపతులకు ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ్‌కుమార్ సదస్సు నిర్వహణకు ఎంతగానో సహకరించారని తెలిపారు. స్వల్ప వ్యవధిలోనే ఏర్పాట్లు చేసి సదస్సును విజయవంతం చేసిన చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సీపీఆర్వో డా. టి.రవి, ధార్మిక ప్రాజెక్టుల అధికారులు, ఉద్యానవన, అన్నప్రసాదం, ఆరోగ్య తదితర విభాగాల అధికారులను, సిబ్బందిని ప్రశంసించారు.

# ఆర్యవైశ్య మహాసభ పెద్దల సమక్షంలో బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది..











**బాపట్ల, కలంకౌంటర్ :** దివారం సాయంత్రం పెదనందిపాడు ఫ్లైఓవర్ దగ్గర ఎమ్మెస్సార్ కళ్యాణ మండపంలో బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కోన రఘుపతి , ఎమ్మెల్సీ పోతుల సునీత , ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ పెద్దలు టీజీ వెంకటేష్ , జయంతి వెంకటేశ్వర్లు , మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ , పోతుల సురేష్ , పెనుగొండ సుబ్బరాయుడు గారు, అంబికా కృష్ణ , మరియు విశిష్ట అతిథులు, ముఖ్య అతిథులు, బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం, బాపట్ల జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం, బాపట్ల జిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగ్, బాపట్ల జిల్లా ఆర్యవైశ్య వాసవి సేవాదళ్, ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ గౌరవ ఛైర్మన్ టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ రాజకీయాలలో ముందుండాలని తల్లి లాంటి వ్యాపారాలను వదులుకొని సాఫ్ట్వేర్ ఉద్యోగాలని మన యువత వెళుతుందని మన వైశ్య కులం వ్యాపారంలో ముందడుగు వేయాలని, మన వైశ్యకులంలో ఉన్న పేదవారిని చేయూతనిచ్చి వారికి అండగా నిలవాలని అన్నారు. నూతన అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ మన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ వారి అనుబంధ సంస్థగా బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం పనిచేస్తుందని ఆర్యవైశ్య మహాసభ పెద్దల సూచనలు సలహాలతో బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం రాష్ట్రంలోని ఒక ఆదర్శ జిల్లాగా ఉండే విధంగా పలు సేవా కార్యక్రమాలు చేస్తామని నూతన పదవులు అలంకరించిన సభ్యులందరూ కష్టపడి బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఆశిస్తున్నాను అన్నారు. బాపట్ల జిల్లా ప్రమాణస్వీకార మహోత్సవానికి విచ్చేసిన మహాసభ పెద్దలకు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసి సహాయ సహకారాలు అందించిన వారందరికీ నా ప్రత్యేక ధన్యవాదాలుఅని నూతన అధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసరావు అన్నారు.

# ఏలూరు లో ప్రత్యేక సంచిక ఆవిష్కరణ








**ఏలూరు,కలంకౌంటర్ :** ప. గో. జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఏలూరు జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా కలం కౌంటర్ దినపత్రిక ప్రత్యేక సంచిక ఆవిష్కరించిన మాజీ రాజ్యసభ సభ్యులు టి జీ వెంకటేష్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, మహాసభ మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు,వాసవి సత్ర సముదాయములు జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, అంబికా కృష్ణ, పల్లపోతు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల లో ప్రత్యేక సంచిక ఆవిష్కరణ






**బాపట్ల,కలంకౌంటర్ :** బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా కలం కౌంటర్ దినపత్రిక ప్రత్యేక సంచిక ఆవిష్కరించిన మాజీ రాజ్యసభ సభ్యులు టి జీ వెంకటేష్, ఎం ఎల్ సి పోతుల సునీత, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహా సభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ,అంబికా కృష్ణ, మహాసభ గౌరవధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు, వాసవి సత్ర సముదాయ ములు జాతీయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు,మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖ రావు, మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు తదితరులు.

# ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం లో టిజీ తో కలసి పాల్గొన్న దేవకి




**ఏలూరు, కలంకౌంటర్ :**ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం ఏలూరు సి ఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియం లో భారీ ఎత్తున జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు, ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులు టీజీ వెంకటేష్ తో కలిసి వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అంతకుముందు వీరిని భారీ గజమాలతో స్వాగతం పలికారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, టీజీ వెంకటేష్, దేవికి వెంకటేశ్వర్లు, అంబికా కృష్ణ, జిల్లా అధ్యక్షులు దివ్వెల జయప్రకాష్ వాహనంపై భారీ ర్యాలీగా, ఊరేగింపుగా సభా స్థలం వరకు జరిగింది. ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్వెల జయప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దుల రవికుమార్, ప్రధాన కార్యదర్శి వేమా సురేష్, కోశాధికారి బచ్చు విష్ణు, కార్యవర్గం చే గౌరవ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆయన అన్నారు. పదవి తీసుకోవటమే కాకుండా ఆ పదవికి తగిన న్యాయం చేయాలని టీజీ అన్నారు. రాష్ట్రంలో ఏ ఆర్యవైశ్యునికి అవసరం వచ్చిన తాను అండగా ఉంటానని అన్నారు. దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం ఎంతో వైభవంగా జరిగిందని, ఇదే రెట్టింపు ఉత్సాహంతో ఆర్యవైశ్య సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని అన్నారు. అనంతరం టీజీ వెంకటేష్ ను, దేవకిని ఆర్యవైశ్య సంఘం వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గాదంశెట్టి శ్రీనివాసరావు,దర్శి వాసు,చుండూరి ఉమామహేశ్వరరావు, నాగరాజు,మాజీ అధ్యక్షులు గున్నయ్య శెట్టి,నాగబాబు, అంబికా రాజా, కోట గురుబ్రహ్మం తదితరు ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

# వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు





**మచిలీపట్నం కల్చరల్,కలంకౌంటర్ :** ప్రముఖ పారిశ్రామిక వేత్త తాడేపల్లి మెహెర్ బాబా దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా సన్మానించిన అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యే శ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా టాక్స్ కన్సల్టేంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉడత్తు శ్రీనివాసరావు, హోల్ సేల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జల్లూరి గోపి, వాసవి క్లబ్ ఐ పి సి యండూరి సురేష్, సమాజం ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి శ్రీనివాస్,అన్నం అశోక్, ఆడిటర్ అన్నా మణిరత్నం, అవోపా సెక్రటరీ నంబూరి చలపతిరావు, జయవరపు ప్రసాద్ తదితరులు.

# నర్సింగ్ కళాశాల శంకుస్థాపన కార్యక్రమం లో మేయర్,పేర్ని కిట్టు





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** స్థానిక ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో మచిలీపట్నం, పాడేరు, పిడుగురాళ్ళకు సంబంధించి నర్సింగ్ కళాశాల లకు శంకుస్థాపన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న మచిలీపట్నం నియోజకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జ్ పేర్ని కృష్ణ మూర్తి (కిట్టు). ఈ కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి ,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ అఛ్చాభా ,పట్టణ అధ్యక్షులుషేక్ సిలర్ దాదా , వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com